# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-05-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **కుటుంబంతో పాటు ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలోనూ తల్లుల పాత్ర కీలకమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

2. **రాష్ట్రంలో వ్యర్థాల నిర్వహణకు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు**

3. **పేద మైనార్టీ విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత ఇంటర్మీడియట్ విద్య అందించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందని మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు.**

4. **రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు.**

==========================

మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాతృమూర్తులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆయన ఈరోజు స్పందిస్తూ, ప్రతి మనిషి జీవితం తల్లి ప్రేమతోనే ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. తల్లి చూపే ప్రేమ, త్యాగం, బిడ్డల పట్ల ఆమెకు ఉండే సంరక్షణ అమూల్యమైనవని కొనియాడారు. కరుణ, సహనం, ఆత్మస్థైర్యానికి తల్లులే ప్రతిరూపాలని పేర్కొన్నారు. కుటుంబ నిర్మాణంతో పాటు ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలోనూ తల్లుల పాత్ర కీలకమని తెలిపారు.

-------------------------

నెల్లూరు నగరంలోని రామచంద్రాపురంలో ఎలక్ట్రిక్ ఆటోల చార్జింగ్ పాయింట్ల నిర్మాణానికి పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఈరోజు శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ... ఈ ఆటోల వల్ల కాలుష్యం తగ్గడంతో పాటు ఇంధన ఖర్చు ఆదా అవుతుందన్నారు. నగరపాలక సంస్థకు సంబంధించి చెత్తను తరలించేందుకు ఈ ఆటోలను ఉపయోగిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని నగరపాలక సంస్థల్లో వ్యర్థాల నిర్వహణకు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలియజేస్తూ..

వాయిస్ ..30..సెకను

-------------------------

రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు పెట్టుబడి మార్కెట్లపై అవగాహన కల్పించేందుకు ఈ నెల 13వ తేదీన విజయవాడలో ప్రత్యేక సదస్సు నిర్వహించనున్నట్లు ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ అభివృద్ధి సంస్థ, నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయులు పాల్గొననున్నారని తెలిపారు. ఎంఎస్ఎంఈల ఏర్పాటు కేవలం బ్యాంకు రుణాలకే పరిమితం కాకుండా, స్టాక్ మార్కెట్ ద్వారా కూడా పెట్టుబడులు సమీకరించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. 'వేస్ట్ టు వెల్త్' వంటి వినూత్న ఆలోచనలతో ముందుకు వస్తున్న స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈ పార్కుల్లోని యూనిట్లకు ఈ వేదిక ఎంతో ఉపయోగపడుతుందని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

పేద మైనార్టీ విద్యార్థులకు కార్పొరేట్ కళాశాలల్లో ఉచిత ఇంటర్మీడియట్ విద్య అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అవకాశం కల్పించిందని రాష్ట్ర రెవెన్యూ, శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఉచిత హాస్టల్, భోజనం, పాఠ్యపుస్తకాలతో పాటు ఐఐటీ–జేఈఈ, నీట్ వంటి ప్రవేశ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ  అందించనున్నట్లు చెప్పారు. తెల్ల రేషన్ కార్డు కలిగి, ఎస్ఎస్ సిలో 450 మార్కులకు పైగా లేదా సీబీఎస్ఈలో 75 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించిన మైనార్టీ విద్యార్థులు ఇందుకు అర్హులని, ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. ఈ నెల 12వ తేదీ ప్రవేశ పరీక్ష దరఖాస్తులకు చివరి తేదీ అని పేర్కొన్న మంత్రి, అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

---------------------------

రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల ఆలయంలో 29 కోట్ల రూపాయలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను మంత్రి నిన్న ప్రారంభించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడారు. గోదావరి పుష్కరాలకు అనుగుణంగా నదీ పరివాహక ప్రాంతంలోని ఆలయాలను 54 కోట్ల 71 లక్షల రూపాయలతో అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి తెలియజేస్తూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం ధూపదీప నైవేద్య పథకానికి నిధులు పెంచామని వివరిస్తూ...

వాయిస్..30.. సెకన్లు

---------------------------

"సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్" సందర్భంగా నంద్యాల జిల్లాలోని శ్రీశైలం దేవస్థానంలో రేపు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. గుజరాత్ లోని  సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణానికి 75 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా కేంద్ర సాంస్కృతిక శాఖ దేశవ్యాప్తంగా "సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్" కార్యక్రమాలను నిర్వహిస్తోందని... ఈ  మేరకు శ్రీశైలంలో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రేపు ఉదయం గంగాధర మండపం వద్ద కలశయాత్ర నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు.

---------------------------

"ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమం"లో భాగంగా తిరుపతి జిల్లా ఏర్పేడులోని భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థ–ఐఐటిలో ఈ నెల 15వ తేదీ నుంచి 27 వరకు "6వ దశ యువ సంగం" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఐఐటి డైరెక్టర్ కె. ఎన్. సత్యనారాయణ తెలిపారు. తిరుపతిలో ఆయన ఈరోజు ఆకాశవాణితో మాట్లాడుతూ, విద్యార్థుల్లో జాతీయ ఐక్యత భావాలను పెంపొందించే లక్ష్యంతో కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. మహారాష్ట్రలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ నెల 16న తిరుపతి ఐఐటికి చేరుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలు ప్రాంతాలను విద్యార్థులు సందర్శించేలా కార్యాచరణ రూపొందించామని ఆయన పేర్కొంటూ...

వాయిస్..30.. సెకన్లు

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు ఢిల్లీలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై కేంద్ర ప్రభుత్వంతో ఆయన చర్చలు జరపనున్నారు. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సమావేశమై గోదావరి జలాల పంపిణీ అంశంపై చర్చించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. గోదావరి జలాల పంపిణీని పునఃసమీక్షించేందుకు ప్రత్యేక ట్రైబ్యునల్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కోరనున్నారు. అలాగే ఢిల్లీలో భారత పరిశ్రమల సమాఖ్య – సీఐఐ నిర్వహించే వార్షిక సమావేశంలో పాల్గొని ముఖ్యమంత్రి ప్రసంగిస్తారని అధికారులు తెలిపారు.

---------------------------

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా కలెక్టర్ కార్యాలయంలో 'రెవెన్యూ క్లినిక్' ఏర్పాటు చేశామని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకర్ రెడ్డి వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక – పీజీఆర్ఎస్ కార్యక్రమం కోసం సమర్పించిన అర్జీల వివరాలను "మీ కోసం" వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. పీజీఆర్ఎస్‌లో నమోదైన ఫిర్యాదుల స్థితిగతులను 1100 టోల్ ఫ్రీ నంబరు ద్వారా తెలుసుకోవచ్చన్నారు.

=====================